కథా నిలయం
శ్రీకాకుళం

# ప్రేమించుకున్నారు

"వీళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు"

ఇలానే కథ ప్రారంభించినట్లయితే "అబ్బే పాత కథ"అని విదిలించి పారేస్తారంతా. నవీన యువతీ యువకులు కొంతమంది ఆట్టే ప్రేమను వొప్పుకోరు. గేలి చేస్తారు. కొంత వయసు దాటిన పిమ్మట వాళ్ళకి కూడా తప్పదనుకోండి 'ఇది ఓ ఘనమైన సత్యం'మని అంగీకరించక.

కొంతమంది ప్రేమకి చూస్తూ చూస్తూ విలువ యివ్వలేరు, "ఆఁ యిందులో యేముంది గనుక? అది మానవధర్మమూ, సహజమూనూ. దంపతుల మధ్య ప్రేమ వుండాలి. అలాగే తండ్రీ కొడుకుల మధ్య, తల్లీ కూతుళ్ళ మధ్య, మళ్ళీ అటుది యిటూ యిటుది అటూ, అన్నా – తమ్ముల మధ్య, అక్కా–చెళ్ళెళ్ళ మధ్య: తిరిగి అటుది యిటూ యిటుది అటూ, రక్త బంధువుల మీద; ఇంకా పెంచే పిల్లి పిల్లలమీద, ముద్దుల కుక్కలమీద ఓహ్ ప్రేమ.... ప్రేమ.... ప్రేమ! ఆఖరికి యిదిధర్మమనీ, సహజమనే కాకుండా నియమమనీ, సాంప్రదాయమనీ, ఆచారమనీ, మరీ బరితెగించినవాళ్ళు అలవాటనీ త్రోసి పారవేయవచ్చు. గ్రీకుభాషలో అయితే పైన చెప్పిన వివిధ బాంధవ్యాల ప్రేమలకు వివిధ పదాలున్నాయి. మనకు అన్నిటికీ ఒక్కటే పదం. మన రాత.

ప్రేమ మహత్తరమూ, మధురమూ అనీ వచనాలతో, లేక యిలా వున్నది ప్రేమ, ఇటువంటి లక్షణాలు గలది ప్రేమ అనే నిర్వచనాలతో యెవరినీ విసిగించదలుచుకోలేదు. "కాని ఆ సంబంధమైన ప్రతిదానికీ అదే పేరు తగిలించి చంపకపోతే, అందులోని అంతస్థులనుబట్టి తరగతులవారీగా విభజించరాదా?" అని మీలో యెవరైనా ప్రశ్నిస్తే యిలా జవాబు చెబుతాను. మనం "శాంతి" "శాంతి" అనే మాటలను నేటి ప్రపంచ పరిస్థితులనుబట్టి అనేక మారులు వింటున్నాం. అన్ని సమయాలలోనూ అదేమాట వుపయోగించటం ఎబ్బెట్టుగా తోచి, వెగటు లేనిది యింకోపదంలేదా అని ఆలోచించి, అలా ఆలోచనలో యెట్లా విఫలత పొందుతామో! కాని యీ సమాధానం మీకు సంతృప్తి కలిగించకపోతే యిది చిత్తగించండి. ఒక విషయాన్ని గురించిన రచన (మనకు సంబంధించినది) మనం చదవటం తటస్థిస్తే పరిస్థితుల ప్రభావాన్ని కొంచమైనా లెక్కచేయకుండా "ఇలా గాకుండా అలా రాస్తే బాగుంటుంది" అని అన్యాయంగా ఆలోచిస్తాం. కాని అదే విషయాన్ని గురించి బాహాటంగా వ్రాయటానికి వుపక్రమించినప్పుడు, ఆ పరిస్థితుల ప్రభావాన్ని, బాధ్యతను వివరించలేనివారమై"ఇలా"నే వ్రాయవలసి వస్తుంది. "కొంచంసేపు నీవు యిదీ అదీ అని మాట్లాడక. అప్పుడు అదీ యిదీ మాట్లాడడం ప్రారంభించారం"టాడు హాస్‌హౌస్. అలాగే మనం అసలు కథలోకి ప్రవేశిద్దాం వుదాహరణ సమేతంగా.

ఒక చక్కని ఉదయం దయానిధి పేపరు చదువుతున్నట్లు నటిస్తూ, ప్రక్కనేవున్న కాఫీకప్పును చూడనట్లు కనబడటానికి రకరకాల ప్రయత్నాలు జరుపుతున్నాడు.

ఇందిర లోపలనుంచి తొంగి చూచింది.

మళ్ళీ వెనక్కువచ్చి ప్రక్కమీద వాలింది. సగం చదివి వదిలిన పుస్తకం పరుపుక్రింద వుంచడం సాంప్రదాయానుగుణంగా వస్తూన్న సంగతి కాబట్టి అలవాటు ప్రకారం తీసి చదువబోయింది. కాని మనసు లగ్నం కాదని తెలిసే యిలా వృధా ప్రయాస యెందుకు పడుతుందో అర్థం కావటంల్లేదు. ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే యెంత హాస్యాస్పదంగా, చౌకబారుగా ఆలోచన్లు ప్రవహిస్తాయో అంతు వుండదు. అసలు కవులూ, రచయితలూ తమ వ్యక్తిత్వాలను కాసేపు కట్టిపెట్టి యిద్దరు మొగుడూ పెళ్ళాలు కొట్లాట సాగించినప్పుడూ, పగటిపూట శవాన్ని తగలబెట్టటం చూసి కథానాయకుడు రాత్రి గదిలో వంటరిగా పడుకున్నప్పుడూ, తమకుమంత్రదండంలభ్యంకాదని తెలిసే అది దొరికితేతాము యేవేమి చేస్తామో అని ఏవో సంఘటనలో అపజయం పొంది పెద్దవాళ్ళు సైతం వూహించటానికి ఆయత్త పడినప్పుడూ, సినిమాలు, నాటకాలు, ప్రకృతి సౌందర్యాలూ చూస్తూ విపరీతమైన ఇన్స్పిరేషన్‌కి లోనవుతున్నప్పుడూ; భార్యాభర్తలు షికారు చలాయిస్తూ వంటరిగా వస్తూన్న స్త్రీని చూడటం తటస్థించి, ఆ స్త్రీ కర్మంగాలి అందమైనదై వున్నట్లయితే భర్తలో చిందర వందరతో కూడిన తీయని సంచలనంకలిగినప్పుడూ - కొమ్ములు పెరిగిన మొగాళ్ళు సైతం యెంత దైన్యంగా, హీనంగా ఆలోచిస్తారో యథాతథంగా చిత్రిస్తే ఆయావ్యక్తులను తలచుకుని నవ్వుకోవటమో, జాలి తలచటమో, ఎక్కిరించటమో, అసహ్యించుకోనడమో, గౌరవించడమో, మెచ్చుకోవటమో, అసూయపడటమో, ఆనందిం

చదమో ఏదో ఒకటి జరిగి. ఓ అపూర్వానుభూతికి గురై, మన నిజస్వరూపాలు కూడా విధిగా బయటకు ప్రదర్శించు కోక తప్పదు.

ఇందిర పుస్తకంమూసి లేచివచ్చి గుమ్మంలోంచి యింకోమారు తొంగిచూసింది. ఇది అయిదోసారి అనుకుంది, ఆమెలో గర్వం ఎప్పుడో ఎగిరిపోయిందనీ. ఆవేశం ఎన్నడో యిగిరి పోయిందనీ అతనికి తెలియదుకదా! పాపం....కాదు తెలియ కూడదు. ఇది నిగ్రహం.

'కర్మంకాలి అత నీస్థితిలో వెనక్కితిరిగిచూస్తే నా అవస్థ ఏంచెప్పేది!' అనుకుంది. వెనువెంటనే 'చూస్తేనే బాగుండును' అనుకుంది. కొంతమంది విషయాన్ని నాన్చక విషాదమో, వినోదమో ఏదోఒకటి చప్పున తేలిపోవాలనిఆశిస్తారు. ప్రస్తుతం ఇందిర ఆ జాతిలోకి చేరింది తాత్కాలికంగా. కాని అంత ర్యుద్ధం సమిసిపోవటానికి వెనుకాడుతోంది. చివరకు 'ఛీ, నేను పాపిష్టిదానిని' అని వాపోతూ తిరిగిపోయి ప్రక్కమీద కూల బడింది.

ఓ నిమిషం గడిచాక వెనుకటిలాగానే గుమ్మంలోనిల్చుని తిల కిస్తూన్న ఇందిర "ఇందూ! ఎంతసేపయింది యిక్కడ కాఫీ పెట్టి? నేను చూడలేదు సుమా!" అని అతనంటాడని అను కుంది. అప్పుడు తాను ఏం జవాబుచెప్పాలని ఈ ప్రశ్నకు జవాబు లభించకముందే మళ్ళీ యిలా అనిపించింది. ఉహూ, అలా అనడు. 'ఇలా తగలడిందే యీ కాఫీ, ఛీ, జంతువులు కూడా తాగవు అని చీదరించుకుంటాడు, పోనీ ఎవడిక్కావాలి? నా కక్కర్లా, తీసుకుపో' అని అరుస్తారని భావించింది. ఇలా

అరిచినా తనకు యిష్టమే. మాట్లాడడం కావాలి ఎలాగో. 'ఛీ, ఇదిఏమిగోల? ఇంత దరిద్రంగా ఆలోచిస్తున్నాను' అనుకొని కాసేపు గిలగిలా తన్నుకుని 'ఈ అహం చావలా. అందుకే నా బ్రతుకిలా తగులడింది' అని గింజుకుంది.

అసలు ఆడది తొంగిచూచినట్లు మొగవాడికి తొంగిచూడడం చేతకాదేమో. స్త్రీ సాధించిన ఘనవిజయాల్లో యిది ఒకటి. అందుకనే నిధి యింతవరకూ అసలుసంగతి కనిపెట్టలేక తన యాతనలో తను వున్నాడు.

ఈలోగా ఇందిర మరోసారి మంచంఎక్కి, పడుకుని, కన్నీళ్ళు తుడుచుకుంటూ లేచింది. చడీచప్పుడూ లేకుండా గుమ్మందగ్గరకు వచ్చి ఓరగా చూసింది.

'ఈసారి' అనుకుంది ఇందిర. "ఇతను కాఫీ త్రాగకపోతే వలవలా ఏడుస్తాను."

తను రెండునిమిషాలు కళ్ళుమూసుకుంటే అతను కాఫీ త్రాగడం తథ్యమని భావించి, కళ్ళు గట్టిగామూసుకుని ఓ నిముషమైనా గడవకముందే ఓపికపట్టలేక తెరిచింది. ఏం మనిషని! ఇతని నరాలు ఉక్కుతో చేయబడినాయా?.... ఈ పరీక్ష నెగ్గిందికాదు. ఒకవేళ కాఫీ చల్లారిపోయిందేమో. చాలాసేపయింది పెట్టి. అందుకే అతను తాగకుండావున్నాడు.

"చూడు" అన్నది ఇందిర అతనివెనక నిలబడి, పౌరుషం నశించిన కంఠంతో నీరసంగా.

అతను ఇందిరకేసి తిరిగాడు కళ్ళు పెద్దవిచేసి. ఆమె ముఖం వెలవెలాపోవటం కనిపెట్టి మనసులో ఏమనుకున్నాడో ఎవడు చెబుతాడు?

"ఏం కావాలి ?"

"నువ్వు కాఫీ తాగకపోతే నామీద వొట్టే" అంది ఇందిర.

అతను కాఫీకప్పుకేసిచూసి "అరే! ఎంతసేపయింది ఇక్కడ పెట్టి? కాని నేను ఈవేళనుంచి కాఫీ తాగనని నీకు తెలీదూ ?" అన్నాడు సావధానంగా.

"నాకేమి తెలుసు నీ మనసులోని మర్మం ? నీలాంటివాళ్ళు స్త్రీలు క్షమించమని అడిగే పరిస్థితి ఆసన్నమౌతుందేమోనని కొద్దిగానైనా సంకోచించరేం? అది సరదానా ? నీముందు యీ ఉదయం దాపరికం లేకుండా చెబుతున్నాను. నేను వంచించబడలేదు. నాది తప్పే."

"ఇందిరా !"

ఇందిర వెక్కి వెక్కి ఏడుస్తూ "ఏం పోగాలం వచ్చిందని! నీ పగ మరే రూపంలోనూ తీర్చుకోలేవా? నువ్వు నన్నెప్పుడైనా ఇట్లా పిలిచి ఎరుగుదువా?"

"నేరం చేశాను. ఇవాళ చేసేవన్నీ పొరపాట్లే. నీమీద నాకేం విరుద్ధభావం లేదు" అని నిధి తను చెప్పేది నిజం అని తెలిపే భావప్రకటనకోసం తాపత్రయపడసాగాడు.

ఇందిర వెనువెంటనే జవాబివ్వలేదు. కన్నీళ్లు అలానే కారుస్తూ తర్వాత "ఇంతకంటే చెప్పుతోకొట్టినా సంతోషించేదాన్ని. రోజూ యీ సరికి మూడోసారి కాఫీ తాగేవాడివి....నన్ను పుట్టింటికి పంపించు" అన్నది.

"ఎందుకూ అక్కడికి. ఏం చేస్తావు?"

"చచ్చిపోతాను."

ఉన్నట్లుండి నిధి గట్టిగా నవ్వసాగాడు.

"కాదు, దేముడికి పూజచేస్తాను" అంది ఇందిర అభిమానంతో.

"ఏ దేముడికి? నీ హృదయంలో ఏ దేముడున్నాడో నే నెరగనా? మీ నాన్న కర్రపుచ్చుకుంటాడు."

"మా అమ్మ నన్నుచూసి బావురుమంటుంది, కాని కావిలించుకుంటుంది. కడుపులోపెట్టుకుంటుంది."

"పోనీ అక్కడేవుండిపో" అని నిధి కొంచెంఆగి "వాళ్ళ నిన్ను యింకోపెళ్ళి చేసుకొమ్మంటే చేసుకుంటావా" అని అడిగాడు ఏదో ఆలోచన తోచి.

ఇందిర ఇంతవరకూ ఏడుస్తూనే జవాబులు చెబుతోంది. ఇప్పుడు హఠాత్తుగా ఏడుపుమాని చిన్నగ నవ్వి "నాకు దేముడిలోనూ, పెళ్ళిలోనూ నమ్మికలేదు. పాపం అంటే జాలివుందిగాని భీతి లేదు. ఏదీ? నాకు చూడాలనివుంది. పుణ్యం ఎక్కడవుందో చూపించు. ఇంకో ఆరునెలలకు ఓ పాప నిన్ను "నాన్నా! అని పిలిస్తేనా?" అని యీ చివరివాక్యం ఓ సారి మనసులో పునః నిర్మాణం చేసుకుని పకపక నవ్వసాగింది.

"నిజంగానా?"

"లేదు, అబద్ధమాడి మనుష్ల్ని వశపర్చుకోవచ్చుననటానికి తార్కాణం. అంతే" అని ఆమె నవ్వు కట్టిపెట్టింది.

"లోకులు వెర్రి అంటారే, అదే యిది."

ఏది? యీ మాటలు తను ఇంతకుముందు అన్నదానికి వర్తిస్తాయని ఇందిర గ్రహించింది. అతనిమాట త్రోసిపారవేసి "ఈః వ్యర్థ ప్రాలాపనలు వొట్టి బూటకమనటానికి నేను సంకో

చించను కొంచమైనా. ఒకరకం మనుష్యుల హృదయాలు శోధించటం వరకూ కాదు, మామూలుగా అర్థంచేసుకోవాలన్నా బంగారు అద్దాలు కావాలి."

ఈ నిర్లక్ష్యం అతనికి కోపం తెప్పించగా "కాని యీ రకం మనుషులకు జీవితం ఎప్పుడో దెబ్బకొట్టితీరుతుంది, నేను దృఢవిశ్వాసంతో చెబుతున్నాను" అన్నాడు.

"నీకు ప్రతిమాటకీ ముందు 'దృఢం' అని ఉపయోగించటం ఓ దురలవాటు. సరేలే నేను పుట్టింటికిపోను....కాఫీ త్రాగు." క్షణంలో నిధి ముఖం ముడుచుకుపోయింది. "నువ్వు పెళ్ళి కెందుకు వొప్పుకోవు?" అన్నాడు కొంచెమాగి బాధగా.

"ఎందుకా? లేచివచ్చానుకాబట్టి. లేచివచ్చినవాళ్ళు పెళ్ళిచేసుకుంటే ప్రేమ నశిస్తుంది."

"ఇదెక్కడి విపరీతం? ఇలాఅయితే యీ అగ్నిపరీక్షకు నేను తట్టుకోలేను సుమా! కాలి బూడిదైపోతాను."

ఇలా అని అతను తనలోతను చింతించటంచూసి ఇందిర కొంచం నవ్వి ముఖం పైకెత్తి "సహగమనం చేద్దామని కోరిగ్గావుంది; అది తీర్చవూ?" అని అడిగింది.

ఉత్తరక్షణంలో ఆమె ముఖం పాముకాటుతిన్నదానిలా నల్లగా మాడిపోయింది. అంది : "ఈ వంటరితనం నేను భరించలేను. ఈ ఉద్విగ్నత అంతా అనుక్షణం సహిస్తూ ఎలా రోజులు గడిపేది?"

"నువ్వు వంటరిదానివా? నేనులేనూ?"

"అయినా నేను వంటరిదాన్నే."

"ఎవరు చెప్పారు? ఎలాగ?"

"ఇటుచూడు" అంది ఇందిర. "సంతోషంగావున్నప్పుడు ఏడుస్తాను ....... ...."

"అవి.... అవి.... ఆనందబాష్ప ...."

"మెదలకుండా విను. చచ్చిపోదామని కోరిక కలిగినప్పుడు విపరీతమైన భయంతో చలించిపోతాను. జీవితంమీద విరక్తి పుట్టినప్పుడు కలలుగంటాను. దుఃఖంవచ్చినప్పుడు చదవబోతాను. ఓదారిస్తే బాగుపడను. యెక్కడికైనా నీతో వస్తే సరదాగావుంటుందని అభిలషించి వచ్చినప్పుడు మథనపడుతూ కూర్చుంటాను. ఇవన్నీ మరి దేనికి లక్షణాలు ?"

అతను ఆశ్చర్యంతో "నాతో ఎక్కడికైనావస్తే నీకు సరదాగా వుండదా?" అని ప్రశ్నించాడు.

"పోనియ్యి" అని ఆమె ఈ ప్రశ్నను నిర్లక్ష్యం చేయబోయింది. కాని అతను "....ఉండదా?" అని రెట్టించాడు.

అతని ముఖంలోకి క్షణకాలందాకా అయోమయంగా చూసిన ఇందిర రెండుచేతుల్లో తలదాచుకుని మెల్లిగా ఏడుస్తూ "అవును. ఏం చేయను" అంది గాద్గదికంగా.

ఈ సంభాషణలో ఏదో సత్యాన్ని అన్వేషిస్తున్న అతని మనసు నిర్భ్రాంతత మరచిపోయింది. "ఎందుకు?" అని అడిగాడు.

"ఎందుకేమిటి? నేను వంటరిదాన్నని చెప్పలా?"

కొంచంసేపువున్నాక తనే అసమర్థతతో కూడిన కోపస్వరంతో "నే నంతే, నాకు సుఖం దక్కదు. కాని నేను దానిని విసర్జించలేను" అని కళ్లు తుడుచుకుంటూ ఏమో చింతలో మునిగిపోయి ప్రపంచాన్ని మరచిపోయినట్టు కనిపించింది.

మెల్లిగా ఆమె భుజాలమీద చేతులువేసి "పోనీ అబద్ధం చెప్పక పోయావా?" అన్నాడు వేదనగా.

తెల్లబోయి సర్దుకుంటూ "నేనబద్ధంచెప్పడమే నీకు సంతృప్తి కలిగిస్తుందని అనుకుంటే యింతకుముందు చెప్పినదాన్నే అబద్ధమని అనుకోరాదూ!"

అతను నోరువిప్పి యేదో చెప్పబోయాడు. కాని యేదో అశక్తత ఆవహించి పూరుకున్నాడు. కనుకొలకుల్లో యెక్కడో నీళ్లు నిలిచాయి. "ఈమె పాషాణమూర్తి" మళ్ళీ తన అభిప్రాయం తప్పనుకున్నాడు. ఆ మనసు నవనీతంకంటే సున్నితం కాబట్టే యిలా జరుగుతుందని నమ్మాడు.

"నన్ను జయిలుకు పంపించు" అంది ఇందిర చాలాసేపు మాట్లాడకుండా పూరుకుని.

"ఎందుకు? నువ్వేం తప్పుచేశావు?"

"తప్పులు చేయకుండా వుండటానికి"

"మళ్ళీవచ్చాక ఆరంభిస్తావనుకో"

"యావజ్జీవ కారాగారం విధించు, బయటకురాకుండా"

"అందుకు యెవరినైనా హత్యచేయాలి"

"చేశాను"

"ఎవరిని?"

"నిన్ను"

ఏమిచేయాలో యిద్దరికీ పాలుపోలేదు. బలహీనంగా ఒకరి నొకరు చూసుకుంటూ చాలాసేపు గడిపారు. ఇందిర తెప్పరిల్లి

కాఫీకప్పు అందుకోబోతూ "చప్పగా చల్లారిపోయివుంటుంది మళ్ళీ తయారుచేసి తీసుకువస్తాను. ఈసారి రెండు కప్పులు ఒకేసారి తాగాలి" అని అతనిముఖంలోకి చూడసాగింది.

అతని వదనమండలమంతా మరోసారి చీకట్లు క్రమ్ముకుంది. ఈ రెండోసారి ఇందిర యీ సంగతి కనిపెట్టింది. కాని కారణం మరోవిధంగా ఊహించుకుంది. నిధి హీనస్వరంతో అన్నాడు: "నేను కాఫీ త్రాగనని చెప్పాను."

"ఇక్కడ నమ్మేవారెవరూ లేరు"

"నన్నుకూడా నమ్మవా?" అన్నాడతను చప్పున కోపంవచ్చి. ఆమె కొద్దిగా బెదిరి "నన్ను పూర్తిగా చెప్పనియ్యవేం? నీ అలవాటు తెలిసివుండికూడా యెలా నమ్ముతాను?" అని మెల్లమెల్లగా పలికింది.

అతను నిశ్చలంగా చెప్పసాగాడు. "కారణం చెబుతున్నాను విను. నాకు చాలారోజులనుంచి గుండెల్లో పోటువస్తూంది. అబ్బ! ఆ సమయంలో యెంత విలవిల్లాడిపోతా ననుకున్నావు? ఈ అనుభవం తిరిగి ప్రాప్తించకతప్పదుకదా అన్న ఆలోచన స్ఫురించి గజగజ వణికిపోతాను. నీతో చెబితే బాధపడిపోతావని యిన్నాళ్ళు దాచాను. కాఫీ మానేస్తే క్రమక్రమంగా తగ్గిపోతుం దనియివ్వాళినుంచీ ప్రయత్నించ దలుచుకున్నాను."

ఈ మాటలు విని ఇందిర అతనికేసి వాడిగా చూసింది. నమ్మ లేదు. ఇదే పరిస్థితి మరోతరుణంలో ఆసన్నమైవుంటే ఆమె హృదయం ఎన్ని చీలికలైపోయేదో యెవరూ చెప్పలేరు. కాని ......! రాత్రి ఆ మహా గందరగోళం. ఇద్దరూ వొకళ్ళ నొకళ్ళు నిర్దాక్షిణ్యంగా తిట్టుకోవటం, ఎంత కఠినుడు?

తన నిశితమైన చూపులతో అతనిని కలవరపరుస్తూ "నీకు కోపంలోకూడా నాకు కోపం వస్తుందన్న భయం యెందుకు? ఇది మానుకొమ్మని చాలాసార్లు చెప్పాను"

అతనికి చప్పున రోషం ఆవహించింది. "ఈ గర్వమూ నిన్ను మానుకొమ్మని అనేక తడవలు హెచ్చరించాను. అసలు రాత్రి మన తగాదా ప్రారంభంకావటానికి అదే కారణమనుకుంటా. నన్ను మరీ అర్భకుడిగా తలపోస్తున్న నీతో యేం చెప్పినా ముప్పే. నాకు గుండెనొప్పి వస్తుందంటే నీవు యెగతాళేనా నన్ను చేయవలసింది?"

"ఎగతాళి యెందుకంటే; నా నోటంట నీ వెన్నడూ అబద్ధం వినటం తటస్థించకపోయినా, నీ నోటంట నేను చాలాసార్లు విన్నాను కాబట్టి"

"దానికీ సమయా సమయాలున్నాయి. నా కెప్పుడూ అదే పనను కున్నావా ఏమిటి?"

"రాత్రి నీకు వచ్చిన కోపానికీ, యిప్పుడు కాఫీ మానెయ్యటానికీ ఏమీ సంబంధం లేదని నేననుకోను" అని ఇందిర యిప్పుడు ఖరాఖండిగా చెప్పేసింది.

"నా ప్రాణంతో పరిహాస మాడుతున్నావన్నమాట ?"

"చెప్పానుగా. ఇలా నన్ను వచించలేవు"

"నేను కాఫీ త్రాగి గుండెమండి చచ్చిపోవటం నీకు వుత్సాహ జనక మన్నమాట"

"నాకు తెలియకపోలేదు.నీ గుండె మండుతుందో మందో. ఆఖరి

సారిగా అడుగుతున్నాను. నిధీ ! నీ కెందుకీ మొండిపట్టు? నువ్వు యివాళ కాఫీ త్రాగకపోతే...."

క్రోధంతో అతడి నేత్రాలు ప్రజ్వలించాయి. "నా చావుని కోరుతున్నావా ? దెయ్యమా ?" అన్నాడు.

ఆమె ఏడుస్తూ "నీ కోపానికి యీ విధంగా ప్రతీకారం తీర్చుకోవడం తగునా? ఇందిర చచ్చిపోయిందనుకున్నావా? నా కోరిక నెరవేరకుండా యీరోజు ఎలా గడుస్తుంది?" అని సర్వం విస్మరించి అతని పాదాలమీద వాలటానికి సిద్ధపడింది.

"మతి వుండి మాట్లాడుతున్నావా ? పో, నా కళ్ళముందు నుంచి"

"నేను పోను. నువ్వు నన్ను దగా చెయ్యలేవు"

"ఛీ. నీకు సిగ్గులేదూ? పొమ్మంటే పోవేం రాక్షసీ!"

ఆమె ఏమీ జవాబు చెప్పలేదు. ప్రక్కకి తిరిగి ఒక్క చూపు చూసింది అతని కళ్ళలోకి. అంతే, అక్కడినుంచి కదిలి చర చరమని లోపలకు వెళ్లిపోయింది.

నిధి వెనువెంటనే నిర్ఘాంతపోయి కూర్చుండి పోయాడు. మెల్లగా అతని కళ్ళలో నీళ్ళు నిండాయి. తన మాటల్లోని సత్యం గుర్తించటానికి యిసుమంతయైనా ప్రయత్నించకుండా యీ ఆడది చెలరేగింది. నిజ స్వరూపం ఏది? మంచి వాళ్ళయిన యిద్దరు యువతీ యువకులమధ్య భయంకర తుఫానులు విజృంభించకుండా వుండనే వుండవా? బాధనంతా దిగమ్రింగుకుంటూ కన్నీళ్లు తుడుచుకునేటంతలో హఠాత్తుగా మనస్సులో ఓ భావం మెదిలి

పశ్చాత్తాప బడజొచ్చాడు. నిన్నటినుంచీ తామిద్దరూ యీ యాత నలో పడి ఎందుకు సతమతమౌతున్నారు?

క్రూరురాలా. ఇందిర ఎప్పుడైనా? ఇది తనకు తెలుసే. అయినా లేనిపోని అర్ధాన్ని కెలికి ఆమె మనస్సు గాయపరిచాడు. ఒక చూపుచూసి వెళ్ళిపోయింది. అది ఏమిచూపు? అవమానభారం కన్న, అసహ్యం కన్న, అసమర్థత కన్న, ఆవేశంకన్న మిన్న యైన మహత్తరశక్తి అందులో ఏదోవుంది. అది తనను కల్లోల పరుస్తూ కాల్చివేస్తోంది.

దగ్ధ హృదయం వాణికి కన్నీరు తొణికింది. సమస్తమూ విస్మ రించి లేచివెళ్ళి ఇందిరకోసం పిచ్చిగా అరుస్తూ యిల్లంతా కలయ తిరిగాడు పాపం నిధి. అలమార్లలోనూ, బీరువాలలోనూ, యినప్పెట్టెలోనూ కూడా ఇందిర కనబడలేదు....అతనికి అర్ధ మైంది. ఓహ్! ఆమె తనను శాశ్వతంగా విడిచి వెళ్లిపోయింది ఎక్కడో చచ్చిపోయేందుకు.

నిధి వీధిలోకి వచ్చాడు. ఈ విశాలమైన ప్రపంచంలో ఎక్క డని వెదుకుతాడు? ఇందిర సామాన్యమైన స్త్రీకాదు. ఆ లేమ హృదయం అభేధ్యం.కాని త్రోవ కనబడిందా మితిలేని వెలుగు. అది వెన్నెల. ప్రియతముని నయనాలు ముద్దుగా మూయించే బిగికౌముది.

ఇందిర ఆత్మహత్య గావించుకోవటానికే వెళ్లిపోయిం దనటం నిస్సందేహం. జగత్తులో ఆమె నివసించటానికి రెండేరెండు అనువైన ప్రదేశాలు. ఒకటి తనచెంత, మరొకటి మృత్యువు తరువాత చేరుకునే ప్రదేశం.

హఠాత్తుగా నిధికి మరో ఆలోచన స్ఫురించింది. మృత్యువంటే విరక్తిలోకూడా భయపడతానని ఆమె తనతో యిందాక

చెప్పింది. ఆ భయానికి తన లాలసతయే కారణం. పోనీ తన మీది లాలసతయే. ఇప్పుడు, తన మాటనే వమ్ముచేసుకుంటుందా ఇందిర ?.... తెగింపును అడ్డే శక్తి ఏదీలేదు.

అతను తృళ్ళిపడ్డాడు. ఆమె లేకపోయాక తన జీవితం కీకారణ్యంలోని చీకటి. చచ్చిపోయినా ఆ చీకటి నశించదు. ఇంకొకటి అనుకున్నాడు. జీవించి వున్నవాడు అల్పుడూ, హీనబుద్ధీ కాబట్టి ఇందిరలాంటి మహోత్కృష్టమైన వస్తువును చేజిక్కించుకో గలిగాడు. ఈ గుక్కెడు ప్రాణం బొందిలో వున్నంత వరకే యీ ఆటలు. ఆ తదనంతరం అట్టి అమూల్య వస్తువును కనీసం తాకే అర్హత తనలో ఎక్కడ మిగులుతుంది?

ఇది రోడ్డు, వీళ్ళు మనుషులు అన్న విషయం విస్మరించి నిధి యెడతెగకుండా కన్నీళ్లు విడవసాగాడు. జనులు పుణ్యంకోసం తాపత్రయపడి లబలబ లాడతారుగాని ఒక్క పాపకార్య మాచరించి ఆ బరువు మోయమనండి. ఎన్ని పుణ్యాల ఫలమో ఆ పశ్చాత్తాపంలోని నిజం.

ఇవేళ నిశ్చయంగా యిందిర ప్రాణాలు విడుస్తుంది.దానికి అనేక మార్గాలున్నాయి.కాని ఒకే ఒక మార్గమైవుంటే తను విరోధించి వుండేవాడు.

ఒకచోట జనం గుంపులు గుంపులుగా వున్నారు. ఆ ప్రక్కగా ఓ లారీ దయ్యంలా నిలబడివుంది. ఏదో స్ఫురించి అది తన మీదకు దూకినట్లు అనుభూతి కలిగింది నిధికి. ఆ దిశకు పరిగెత్తాడు.

ఎవరో ఆడది వేగంగా వస్తూన్న లారీక్రింద పడి ఆత్మహత్య చేసుకుందని అతవి ఆతృత కనిపెట్టి యెవరో వూదారు.

మనుషులు పిచ్చివాళ్ళ అనటానికి కారణం యిది ఒక్కటే కని పిస్తుంది. ఎవరెంత చీదరించుకున్నా చెవిని బెట్టక తోసుకుంటూ లోపలికి పోయాడు. అక్కడ లారీముందు నేలమీద రక్తం మర కలు మినహా వేరే ఏమీ కనపడలేదు.

"అమ్మో ! ఇది ఇందిర నెత్తురే. నాకు బాగా తెలుసు"

అప్పటికే జనం తిరోగాములై వెళ్లిపోతున్నారు. నిధి ఓ నడి వయస్కుడ్ని అడ్డుకుని ఆపాడు.

"ఎవరు చచ్చిపోయింది ?"

"చచ్చిపోలా యింకా. చచ్చిపోతోంది. ఎవరో ఆడుది"

"ఎన్నేళ్ళుంటాయి ?"

"ఏం ? నీకేమైనా చుట్టంకనకనా ?" అని ఆ వ్యక్తి హేళనచేసి నవ్వి, జవాబు చెప్పకుండా వెళ్ళిపోయాడు.

నిధి ముచ్చెమటలు కారుతూండగా తడి ఆరుతున్న గొంతుకతో ఓ కుర్రవాడిని యిలా బ్రతిమిలాడాడు.

"ఆ లారీక్రింద పడింది యెవరో చెప్పవూ నాయనా ? నీ మేలు మరచిపోలేను"

ఆ కుర్రవెధవికి జాలికలిగింది కాబోలు. వినయంగా "ఒక ఆడ మనిషండి, పాతికేళ్ళుంటాయి"

"పాతికేళ్ళ" అని వెలవెలపోయాడు నిధి!

"ఏ చీర కట్టుకుంది ?"

"తెల్లచీర"

అయ్యో ! ఆమె ఇందిరే. తాను యెంతటి పాపిష్టి!

కథా నిలయం
శ్రీకాకుళం

"ఎటువైపు తీసుకుపోయారు ?"

"ఆసుపత్రికి"

"ఆసుపత్రికి...." నిధి తత్తరపాటుతో బయల్దేరాడు. పదిమార్లు దారి తప్పాడు. తను యిందిరను కడసారి అయినా చూడగలుగుతాడా? పోనీ ఆమె మృతకళేబరాన్నయినా....

గజగజమని వణికిపోతూన్న తనువుతో నిధి ఓ పావుగంట సేపటిలో ఆ ఆస్పత్రి ఆవరణలోకి చేరుకున్నాడు. ఆమె యెంతకు తెగించింది? పోయి కాళ్ళమీద పడదామని వుంది.

అక్కడకూడా జనం గుంపులు గుంపులుగా వున్నారు. నిధిని యెవరూ లోపలకు పోనివ్వలేదు. చొరవ తీసుకోబోతూంటే వార్డర్ వచ్చి గదమాయించి వెళ్ళాడు. హతాశుడై బయటనే నిలబడి పోయాడు. నలభయ్యేళ్ళ గంభీర ధనిక విగ్రహం సిల్కు రుమాలుతో కన్నీరు తుడుచుకోవటం కనిపించింది. మెల్లగా అతని దగ్గరకు చేరాడు.

"మీ రెందుకు కన్నీరు విడుస్తున్నారు" నిధి అడిగాడు అమాయకంగా.

"ఒక అమాయకురాల్ని చేతులారా చంపుకుంటూన్న పాపిష్టిని" నిధికి ఆదుర్దా హెచ్చింది. ముందుకు వంగాడు.

"అరే, మీరూ యేడుస్తున్నారే" అన్నాడు ఆశ్చర్యంగా ఆయన.

"అవును. నన్ను ప్రేమించిన యువతి లోపలచచ్చిపోతోంది."

ఆ ధనికుడు నిధి రెండు భుజాలూ పట్టుకుని కుదిపాడు. ఆ కళ్ళలో నీళ్ళతో తడిపిన ఆనంద రేఖ. "ఆమె మీకు సంబం

దించిన యువతా ? సుమతికాదా ?" అని కొంచం ఆగి నిట్టూర్పుతో "ఎంత గండం గడిచింది ! ఆమె నా సుమతే అనుకున్నాను. గుర్తులు యెవరో చెప్పగా" అన్నాడు.

నిధి నివ్వెరపోయి విన్నాడు. కాళ్ళక్రింద భూమి కదిలినట్లయింది. వ్యక్తి సుమతి యెందుకు కాకూడదు. ఇందిర యెందుకు కావాలి ?

లేదు. తనకు న్యాయం యెప్పుడూ జరగదు. ఈ లోకంలో తాను ఎప్పుడూ అంతే. అయినా ఆ గుర్తులు కేవలం ఆ అభాగ్యురాలివే.

ఈ లోగా నర్సు వచ్చి ధనికుడితో లోపలకు రమ్మనిచెప్పింది. ఈ అవకాశం వృధా చేసుకోకుండా నిధికూడా లోపలికి నెట్టుకుపోయాడు ఆయన వెంబడే. ఓ గదిలోకి వెళ్ళాడు. ముసుగు కప్పబడిన శవం అక్కడవుంది. పాదాలు తెల్లగా కనబడుతున్నాయి గుడ్డ యివతలనుంచి.

"ఇందూ !" అని నిధి వెర్రికేక వేశాడు.

ఈ అరుపు ఎవరూ వినిపించుకోలేదు. అంతా ఎవరి గొడవలో వాళ్లు వున్నారు. నర్సు మెల్లగా వెళ్ళి ముఖంపైన బట్ట తొలగించి వేసింది.

సర్వం నిశ్శబ్దం. ఒకేఒక నిమిషం గడిచింది. "సుమతీ నేను చూడలేను. నిన్ను నేను చూడలేను" అని ధనికుడు బావురుమంటూ నిధిని త్రోసుకుని బయటకు వెళ్ళి, యింకా పిచ్చిగా అరుస్తున్న అరుపులు వినిపిస్తూనే వున్నాయి.

నిధి ఆనందాతిరేకంతో బయటకు పరిగెత్తాడు. శరీరమంతా ఏదో మగత క్రమ్ముకుంటోంది. అతను సిగ్గు విడిచి పరుగెత్తు తున్నాడు.

నిధి తృళ్ళిపడి వగరుస్తూ ఆగాడు. ప్రక్కనుంచి ఓ లారీ సర్రు మని వాయువేగంతో దూసుకుపోయింది. కళ్ళు తిరిగాయి. ప్రమాదం ఒక్క అంగుళం మేరలో తప్పిపోయింది.

తనను తను అదుపాజ్ఞల్లో పెట్టుకుంటూ యింటికేసి నడుస్తున్న నిధికి ఒకచోట పెద్ద జనసమూహం కనబడింది. మీదకు వురుకు తున్నట్లు డెయ్యంలా పెద్దలారీ. అది ఏమిటో తను తెలుసుకో కూడదనుకున్నాడు. ఇది యిందాక ప్రమాదం జరిగిన ప్రదేశం మాత్రం కాదు. అయినా యీ మాటలు చెవిని బడినాయి.

"ఎవరో అభాగ్యుడు. లారీక్రిందపడి చచ్చిపోయాడు, గంట సేపనగా అయింది.

"ఈ ఊళ్లో యిది రెండో ప్రమాదం యివేళ. సరిగ్గా అదే టైముకి అవతలి బజారులో ఒక ఆడమనిషి లారీక్రింద పడింది ?"

"శవం యింకా యిక్కడే వుందా ?" అని నిధి అనుకో కుండా అడిగాడు ప్రక్కవాడిని.

"లేదు. తీసుకుపోయారు ఎక్కడికో ?"

నిధికి ఏదో జవాబు తోచింది. తాను ఆ ప్రమాదం ఫలితం చూశాక యింటికి పోవాలని ఎందుకు ఆతృత చూపించాడో... అతనికి బోధపడింది.

ఓ పావుగంట గడిచాక అతను యింటికి చేరుకుని చూసేసరికి హాల్లో కుర్చీలో కూలబడి ఇందిర రెండుచేతుల్తో ముఖాన్ని కప్పు కుని ఎక్కి ఎక్కి ఏడుస్తోంది.

"ఇందూ !" అన్నాడు నిధి ఆమెను సమీపిస్తూ.

ఆమె సంభ్రమాశ్చర్యాలతో తలఎత్తి చూసింది.

ఒక నిమిషం గడిచాక నిధి ఆమె చెంపలు నిమురుతూ "నువ్వు చచ్చిపోలేదు కదూ" అన్నాడు.

ఇందిర నేత్రాలనుండి నీళ్లు యింకా సంతతధారగా ప్రవహిస్తు న్నాయి. తల ఎత్తి అతని కళ్ళలోకి చూస్తూ "లేదు. నువ్వెందుకు చచ్చిపోయావు ?" అనడిగింది.

o---o